క్లుప్తంగా

హాట్‌బాక్సులు, నోట్ పుస్తకాల పంపిణీ



హాట్ బాక్సులు అందజేస్తున్న తోట ఎడ్వర్డ్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరానికి చెందిన ఏలూరు సెంట్రల్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు అవసరమైన క్యారేజీలు, హాట్‌బాక్సులు, నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. గురువారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు తోట ఎడ్వర్డ్ మాట్లాడుతూ తమ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పేదలకు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా 75 మంది విద్యార్థులకు ఆయా వస్తువులు పంపిణీ చేశారు. క్లబ్ సభ్యులు ఎం మాలతీ దేవి, ఆర్ రామకృష్ణ, టి.రవి తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు ఉద్యోగుల నిరసన



ఏలూరు యూనియన్ బ్యాంకు వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

ఏలూరు టౌన్ : ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ పిలుపు మేరకు స్థానిక ఆర్‌ఆర్‌పేటలోని ఆంధ్రాబ్యాంక్, యూనియన్ బ్యాంకు రీజనల్ కార్యాలయం ఎదుట ఏలూరు నగరంలో బ్యాంకు ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా బ్యాంక్ ఎంప్లాయీస్ సమన్వయ కమిటీ సెక్రటరీ శ్రీనివాసరావు, యూనియన్ బ్యాంక్ నాయకులు లక్ష్మణరావు మాట్లాడుతూ బ్యాంకుల్లో వివిధ కేటగిరీల్లో పోస్టులను శాశ్వత ప్రాతిపదికన భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. బ్యాంకుల్లో పోస్టులు భర్తీ చేయకపోవటంతో ఉద్యోగులపై ఒత్తిడి పెరిగిపోతుందన్నారు. కార్యక్రమంలో సమన్వయ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్, మహిళా నాయకురాలు గాయత్రి, ఉద్యోగులు ఉన్నారు.

నేడు గాలాయగూడెంలో వై ఏపీ నీడ్స్ జగన్

దెందులూరు: మండలంలోని గాలాయగూడెంలో శుక్రవారం సాయంత్రం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ చిలకా వెంకట సుబ్బారావు, పార్టీ అధ్యక్షులు అంబటి లక్ష్మణరావు, సొసైటీ చైర్మన్ తోట అచ్చియ్య, ఎంపీటీసీ సభ్యురాలు సొంగా విమలకుమారి తెలిపారు. ఈ మేరకు గురువారం సంయుక్తంగా ఓ ప్రకటన విడుదల చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

గడపగడపకు అర్జీలకు సత్వర పరిష్కారం

- 11వ డివిజన్‌లో రూ.50 లక్షల అభివృద్ధి పనులకు ఆమోదం
- ఎమ్మెల్యే ఆళ్ల నాని





మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాని, సమీక్షకు హాజరైన అధికారులు, సచివాలయ ఉద్యోగులు



స్థలం మంజూరు పత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే ఆళ్ల నాని

ఏలూరు టౌన్ : ఏలూరు నియోజకవర్గంలో ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పన, సంక్షేమం, అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని, గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల నుంచి అందిన అర్జీలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టామని ఏలూరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని అన్నారు. ఏలూరు వన్‌టౌన్ 11వ డివిజన్ 47వ సచివాలయం పరిధిలో ఇటీవల చేపట్టిన గడపగడపకు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల ఇచ్చిన అర్జీల పరిష్కారంపై స్థానిక శ్రీరామ్‌నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో గురువారం ఆయన అధికారులతో సమీక్షించారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు శ్రద్ధ వహించాలన్నారు. ఏదైనా సాంకేతిక లోపం ఉంటే వాటిని సరిచేయాలని ఆదేశించారు. ఏలూరు నగరంలో ప్రతి పేదవానికీ సంక్షేమ పథకాలు అందాలన్నదే తమ ధ్యేయమని అన్నారు. ఇప్పటికే ఏలూరు నియోజకవర్గంలో వందల కోట్ల మేర నిధులతో అభివృద్ధి పనులు చేస్తున్నామని వివరించారు. 11వ డివిజన్ పరిధిలో సుమారు రూ.50 లక్షల నిధులతో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు యుద్ధప్రాతిపదికన ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. ప్రభుత్వ బడుల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో పనిచేయాలని ఆదేశించారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేదిలేదని అధికారులను హెచ్చరించారు. ఈ సమీక్షలో కార్పొరేటర్ వంకదారు ప్రవీణ్ కుమార్, పార్టీ నాయకులు కోయ సత్తిబాబు, డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాసరావు, నూకపెయ్యి సుధీర్‌బాబు, పార్టీ జిల్లా కోశాధికారి మంచెం మైబాబు, నగర కమిషనర్ సంక్రాంతి వెంకట కృష్ణ, పీవో కృష్ణమూర్తి, ఎంహెచ్‌ఓ మాలతి, ఆయా శాఖల అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ఉన్నారు.

ఎమ్మెల్యే నానికి కృతజ్ఞతలు

ఏలూరు నగరంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ భవన నిర్మాణానికి స్థలం మంజూరు చేసిన ఎమ్మెల్యే ఆళ్ల నానికి అసోసియేషన్ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక శ్రీరామ్‌నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో గురువారం ఎమ్మెల్యే నానిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అసోసియేషన్ ఏలూరు శాఖ అధ్యక్షుడు డాక్టర్ సదాశివరావు, ప్రతినిధులు విజయ్‌మోహన్, దామోదర్‌రెడ్డి, ఎంఎల్‌వీ ప్రసాద్ మాట్లాడుతూ జూలై 15న ఎమ్మెల్యే నానిని కలిసి అసోసియేషన్ భవన నిర్మాణానికి స్థలాన్ని మంజూరు చేయాలని కోరగా, వెంటనే గ్రీన్‌సిటీలో స్థలాన్ని మంజూరు చేయడం, నగరపాలక సంస్థ కౌన్సిల్ తీర్మానం చేయించడం సంతోషంగా ఉందని అన్నారు. కార్యక్రమంలో మెడికల్ కౌన్సిల్ డైరెక్టర్ దిరిశాల వరప్రసాదరావు, రవీంద్ర, రమేష్‌చంద్రశేఖర్, కృష్ణ భగవాన్, సుబ్బారావు, సాయిరామ్‌ప్రసాద్, ప్రసన్నకుమార్, రాజేశ్వరరావు, హేమలత, భానుమూర్తి తదితరులు ఉన్నారు.

అయోధ్య అక్షతల కలశాలకు స్వాగతం



అయోధ్య అక్షతల కలశాలను ఊరేగిస్తున్న దృశ్యం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): అయోధ్య పుణ్య క్షేత్రం నుంచి శ్రీరామ పూజా అక్షతల కలశలు గురువారం ఏలూరుకు చేరుకున్న నేపథ్యంలో ఏలూరు టీటీడీ కళ్యాణ మండపం వద్ద శ్రీరామ నామ సంకీర్తనతో అక్షతల పవిత్ర కలశాలకు బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీఎస్‌ఆర్ చౌదరి ఆధ్వర్యంలో ఘనస్వాగతం పలికారు. అనంతరం ఊరేగింపుగా వాటిని దొండపాడు దత్తాశ్రమానికి తీసుకెళ్లి అక్కడ భద్రపరిచారు. ఈ సందర్భంగా విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తనికెళ్ల సత్య రవికుమార్ మాట్లాడుతూ దేశ ప్రజలు 500 సంవత్సరాల నుంచి ఎదురుచూస్తున్న శుభ ఘడియలు త్వరలో రాబోతున్నాయని అన్నారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి గడ్డం నాగరాజు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు చౌటపల్లి విక్రమ్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమం సీఎం జగన్ ధ్యేయం



మాదేపల్లి పంచాయతీ కార్యాలయం వద్ద పథకాల ఫ్లెక్సీని ఆవిష్కరించిన పార్టీ నాయకులు

ఏలూరు రూరల్: పేదలను అన్ని రంగాల్లో అభివృద్ధి బాట పట్టించడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని ఎంపీపీ పెన్మెత్స శ్రీనివాసరాజు అన్నారు. గురువారం ఏలూరు రూరల్ మండలం మాదేపల్లిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంక్షేమ, అభివృద్ధి పనుల కోసం ప్రతి గ్రామంలో కోట్ల రూపాయల ఖర్చు చేసిందని అన్నారు. సీఎం వైఎస్ జగన్ నాలుగున్నరేళ్ల పాలనపై ప్రజలు సంతోషంగా ఉన్నారని సీనియర్ నాయకులు పీవీరావు అన్నారు. పార్టీలకు అతీతంగా పాలన సాగించిన ఏకైక నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని పార్టీ మండలాధ్యక్షుడు తేరా ఆనంద్ కొనియాడారు. గ్రామ సర్పంచ్ కొరపాటి శ్రీరామ్‌ప్రభుదేవ్, ఉపసర్పంచ్ నరహరిశెట్టి రాధాకృష్ణ, జాలిపూడి సొసైటీ చైర్మన్ బొల్లిముంత రాము, వార్డు సభ్యుడు పంపుల శ్రీను తదితరులు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరిని మరోసారి గెలిపించుకోవాలని నినదించారు. నాయకులు గ్రామ కూడలిలో పార్టీ జెండాను ఎగురవేసి, పంచాయతీ కార్యాలయం వద్ద సంక్షేమ పథకాల ఫ్లెక్సీని ఆవిష్కరించారు. ఈఓపీఆర్డీ ఎం సరళకుమారి, కార్యదర్శి సుమలత తదితరులు పాల్గొన్నారు.

కుక్కల బెడద నివారించాలి

ఏలూరు రూరల్: నగరంలో వీధి కుక్కల బెడదను అరికట్టాని సీపీఎం ఏలూరు నగర కార్యదర్శి పి.కిషోర్ ఓ ప్రకటనలో కోరారు. పత్తేబాద, ఏటిగట్లు, సంజయ్‌గాంధీకాలనీ పరిసరాల్లో వీధికుక్కలు పిల్లలను తీవ్రంగా గాయపరచాయని పేర్కొన్నారు. వీధికుక్కల సంఖ్య పెరిగిపోయి పాదచారులు, ద్విచక్ర వాహనాలపై వెళుతున్న వారిని వెంటపడి కరుస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. నిత్యం పదుల సంఖ్యలో బాధితులు ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికొచ్చి చికిత్స పొందుతున్నారని వివరించారు. అధికారులు స్పందించి కుక్కలను నివారించే చర్యలు తీసుకోవాలని కోరారు.

వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు



గడపగడపకు కార్యక్రమంలో మహిళలకు సంక్షేమ పథకాల బ్రోచర్ అందిస్తున్న ఎమ్మెల్యే ఆళ్ల నాని

ఏలూరు టౌన్: పేదలకు అత్యాధునిక వైద్య సేవలందించేందుకు వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి శ్రీకారం చుట్టారని ఇంటి వద్దకే వైద్యులు వెళ్లి సేవలు అందించడం దేశంలోనే ఆదర్శంగా నిలిచిందని ఏలూరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని అన్నారు. ఏలూరులో 122వ రోజు వన్‌టౌన్‌లోని 12వ డివిజన్‌లో గురువారం సాయంత్రం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రజాసమస్యలు అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ సీఎం జగన్ డాక్టర్ వైఎస్సార్ విలేజ్ క్లీనిక్స్ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు మెరుగైన వైద్యాన్ని చేరువ చేశారని తెలిపారు. గర్భిణులు, దీర్ఘకాలిక వ్యాధితో బాధపడేవారు, తీవ్ర అనారోగ్యంతో మంచంపై ఉన్న వ్యక్తులకు వారి ఇంటికే వెళ్లి వైద్యులు, సిబ్బంది పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందిస్తున్నారని, ఫ్యామిలీ డాక్టర్ విధానం ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉందని వివరించారు. ప్రతి నెలా ఒక్కో గ్రామానికి రెండు సార్లు 104 సంచార వైద్యశాలతో వెళ్లి ఇద్దరు వైద్యులు వైద్య పరీక్షలు, చికిత్సలు అందించేలా నూతన విధానాన్ని అమలు చేస్తున్నారని చెప్పారు. వైద్య రంగంలో ఇలాంటి సేవలు దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేవన్నారు. దేశానికే ఆదర్శంగా రాష్ట్రంలో వైద్య రంగంలో అద్భుతమైన మార్పులు తీసుకొచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఏలూరు నియోజకవర్గంలోని అర్బన్ ప్రాంతంలో ఇప్పటికే నాలుగు వైఎస్సార్ యూపీహెచ్‌సీలు అత్యాధునిక సౌకర్యాలతో ప్రజలకు సేవలు అందిస్తున్నాయని నాని చెప్పారు. తొలుత కార్పొరేటర్ కర్రి శ్రీనివాస్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, ప్రజలు ఎమ్మెల్యే నానికి నీరాజనం పలికారు. కార్యక్రమంలో నగర మేయర్ షేక్ నూర్జహాన్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి, కోఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్ పెదబాబు, జిల్లా కోశాధికారి మంచెం మైబాబు, డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాసరావు, నూకపెయ్యి సుదీర్‌బాబు, ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవులు, కోఆప్షన్ సభ్యులు మున్నుల జాన్‌గురునాథ్, అదనపు కమిషనర్ సీహెచ్ బాపిరాజు, కార్పొరేటర్లు, పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

మాదకద్రవ్యాలతో జీవితాలు నాశనం



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న సెబ్ ఎస్సై సుబ్బారెడ్డి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): మాదక ద్రవ్యాల వల్ల చాలా జీవితాలు నాశనమవుతున్నాయని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సబ్ ఇన్‌స్పెక్టర్ పి.సుబ్బారెడ్డి అన్నారు. నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యంలో బాలల హక్కుల వారోత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక తంగెళ్లమూడి ఆంధ్ర రత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్య నగరపాలక ఉన్నత పాఠశాల విద్యార్థులకు డ్రగ్ ఫ్రీ సూపర్ హీరో అనే అంశంపై సందేశాత్మక లఘు చిత్ర నాటక ప్రదర్శన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సుబ్బారెడ్డి మాట్లాడుతూ మత్తు పదార్థాలు విద్యార్థుల జీవితాన్ని నాశనం చేస్తున్నాయని, సరదాగా అలవాటు చేసుకొని చివరకు మత్తు పదార్థాలు లేకుండా ఉండలేని పరిస్థితికి వస్తుందని అన్నారు. మత్తు, మైకంలో చదువుకు దూరమవుతూ శక్తిని నిర్వీర్యం చేసుకుంటున్నారని వివరించారు. నవజీవన్ బాల భవన్ జోనల్ కోఆర్డినేటర్ బి.నెహిమియా మాట్లాడుతూ మాదక ద్రవ్యాల ప్రభావం బాలలపై ఎక్కువగా ఉంటోందని, ముందు జాగ్రత్తోనే మాదక ద్రవ్యాల అలవాటు, ఆలోచనలపై అవగాహన కల్పించి వారిలో చైతన్యం తీసుకురావచ్చని అన్నారు. పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నవజీవన్ బాల భవన్ జోనల్ కోఆర్డినేటర్ డి.రజిత, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఇ.ఉజ్వల, ఉపాధ్యాయులు, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	32	అరటి కాయ (1)	07-10
వంకాయలు (గులాబీ)	24	చిక్కుడు కాయలు	48
వంకాయలు (కాంతులు)	28	చామదుంపలు	40
వంకాయలు (తెలుపు)	--	ములక్కాడలు	07-10
బెండకాయలు	32	కంద	56
పచ్చిమిర్చి	30	బీట్‌రూట్	40
కాకర కాయలు	28-32	కీరా దోస	48
బీరకాయలు	24	ఫ్రెంచ్‌బీన్స్	90
బీరకాయలు (పందిరి)	36	అల్లం	130
క్యాబేజీ	24	కొత్తిమీర (కట్ట)	23
క్యారెట్	50-60	పాలకూర	10
దొండకాయలు	22	చుక్కకూర	10
బంగాళదుంపలు	26	తోటకూర	10
ఉల్లిపాయలు	45-55	గోంగూర	06
గోరుచిక్కుడు	40	పుదీనా	05
దోసకాయలు	18	బఠాణి	--
ఆనబకాయ (1)	15-20	క్యాప్సికమ్	70
పొట్లకాయ(1)	15-20	చిలకడదుంప	28

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	32
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	36
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	36
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	35

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	12
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	28
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	01
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	23
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	21
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	13
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	32
ఏలూరు -తిరుపతి	16.00	4830	31

రోడ్డు ఆక్రమణను అడ్డుకోవాలి



కొక్కిరాయిలంక పరిసరాల్లో రోడ్డు ఆక్రమించి ఏర్పాటుచేసిన రేకుల ప్రహరీ

ఏలూరు రూరల్: ఏలూరు రూరల్ మండలం కొక్కిరాయిలంక గ్రామ పరిసరాల్లో ఆర్‌అండ్‌బీ రోడ్డు ఆక్రమణకు గురౌతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. కొక్కిరాయిలంక నుంచి పైడిచింతపాడుకు వెళ్లే దారిలో చేపల చెరువు యజమానులు రోడ్డును ఆక్రమించి రేకులతో ప్రహరీ ఏర్పాటు చేశారని తెలిపారు. దీంతో చెరువులో నీరు రోడ్డుపైకి చేరడంతో రోడ్డు గోతులమయంగా మారిందన్నారు. ఫలితంగా రోడ్డుపై ప్రయాణించే పాదచారులు, వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. భారీ వాహనాల రాకపోకలకు మరింత ఇబ్బందులు ఏర్పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వాస్తవానికి ఆక్రమణదారులు రోడ్డుపక్క ఉన్న ప్రభుత్వ పోరంబోకు భూమి కబ్జా చేసి చెరువు తవ్వారని పలువురు ఆరోపించారు. రోడ్డు ఆక్రమణపై పలుసార్లు ప్రశ్నించినప్పటికీ చెరువు యజమానులు పట్టించుకోలేదని వైఎస్సార్ సీపీ కొక్కిరాయిలంక నాయకుడు అశోక్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్‌అండ్‌బీ, రెవెన్యూ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

జగనన్న ప్రగతిపథం పోస్టర్ ఆవిష్కరణ

దెందులూరు: విజయవాడలో ఈ నెల 18వ తేదిన వైఎస్సార్‌సీపీ ఐటీ విభాగం తరపున నిర్వహించనున్న జగనన్న ప్రగతి పథం పోస్టర్‌ను గురువారం దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఆవిష్కరించారు. కార్యక్రమంలో స్టేట్ ఐటీ వింగ్ కోఆర్డినేటర్ రోసిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు అంజిరెడ్డి, వేణురెడ్డి, ఏలూరు జిల్లా అధ్యక్షులు గూడపాటి పవన్‌కుమార్ పాల్గొన్నారు.

బాసుదేవాచార్య సేవలు వెలకట్టలేనివి



బాసుదేవాచార్యకు నివాళులర్పిస్తున్న సభ్యులు

ఏలూరు రూరల్: సీఐటీయూ జాతీయ నాయకుడు ఎల్ఐసీ ఏఓఐ వ్యవస్థాపకుడు బాసుదేవాచార్య ఎల్ఐసీ అభివృద్ధి, సమస్యల పరిష్కారానికి చేసిన సేవలు వెలకట్టలేనివని వక్తలు కొనియాడారు. ఆయన సంతాప సభ గురువారం ఏలూరులో నిర్వహించారు. ఏఓఐ బ్రాంచ్ అధ్యక్షుడు పి.శ్రీరామ్‌ప్రసాద్, కోశాధికారి వైఎస్ కనకరావు, రాష్ట్ర కార్యదర్శి జి.రవికిషోర్, ఆల్ ఇండియా కౌన్సిల్ సభ్యుడు డీవీ రామకృష్ణ, జోనల్ ఈసీ సభ్యుడు బి.రామ్మోహనరావు, సుధాకర్ తదితరులు బాసుదేవాచార్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

సీఎం జగన్ గొప్ప పరిపాలనాదక్షుడు

ఎమ్మెల్యే వాసుబాబు



చిన్నవెల్లమిల్లిలో పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే వాసుబాబు

ఉంగుటూరు: పేద వర్గాల అభివృద్ధికి నిరంతరం శ్రమిస్తున్న గొప్ప పరిపాలనా దక్షుడు సీఎం జగన్ అని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. గురువారం ఉంగుటూరులో ఆయన గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ఆయా కుటుంబాలకు పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వాసుబాబు వివరించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వాసుబాబు మాట్లాడుతూ సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు మేలు చేసే విధంగా జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని చెప్పారు. గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం సచివాలయ వ్యవస్థ తీసుకురావడం ద్వారా సాకారమైందన్నారు. వలంటీర్ల వ్యవస్థతో పాలన ప్రజలకు దగ్గరైందని, పారదర్శకంగా పాలన సాగుతోందని వివరించారు. సచివాలయ ఉద్యోగాలిచ్చి యువతను ముందుకు నడిపించిన ఘనత జగన్‌దేనని కొనియాడారు. బీసీలకు పెద్దపీట వేశారని తెలిపారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మరడ మంగారావు, ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, పంచాయతీరాజ్ జిల్లా అధ్యక్షుడు పుప్పాల గోపి, సచివాలయాల మండల కన్వీనర్ పెనుగొండ బాలకృష్ణ, సొసైటీ అధ్యక్షుడు యెలిశెట్టి పాపారావు బాబ్జి, సర్పంచ్ వస్క కుమార్‌రాజా, ఉపసర్పంచ్ నాగు, మాజీ సర్పంచ్ శేషగిరిరావు, సాయి తదితరులు పాల్గొన్నారు.



